శాంతారామ్-

# తొలకరి




"తాతా! ఓ కథ చెప్పవే' మనవడు గోముగా అడిగాడు. తాత చుట్ట అవతల పడేసి మరోసారి తుపుక్కున ఊశాడు. చీకటి పడినా కొసవేసవి గాలులు వేడిగా వీస్తున్నాయి. దూరంగా వీధిలో ఏడుపుని సాగదీస్తోందో కుక్క. చీకట్లో తాత ముఖం స్పష్టంగా కన్పించట్లేదు. అందుకే మనవడు మళ్ళీ అడిగాడు కథ చెప్పమని.

"ఈ రోజు నువ్వే చెప్పరా కథ" తాత తెలివిగా తప్పించుకున్నాడు.

"తర్వాత నువ్వు చెప్పాలి మరి" మనవడు షరతు పెట్టాడు.

తాత సరేనన్నాడు.

మనవడు కథ మొదలెట్టాడు.

"అనగా అనగా ఒక ఊళ్ళో శంకరయ్య అనేవాడుండేవాడు. అతను చాలా మంచోడు. ఎవరు ఏది అడిగినా ఇచ్చేశేవాడు. అతను చాలా బీదోడు."

"మరి బీదోడైతే ఎట్లా ఇచ్చేవోడురా" తాత లా పాయింటు లాగేడు కవ్వింపుగా.

"అడిగింది లేదనకుండా ఇచ్చేసో వోడు కాబట్టే బీదోడయ్యాడు తాతా. అయితే అతనికి ఎవ్వరూ లేరు. ఇంట్లో ఒక్కడే వుండేవాడు. ఓ సారి నాలుగు రోజులు అతనికి తిండే దొరక లేదు. అతనుఎవర్నీ అడిగేవోడు కాదు. అందుకే శోషవచ్చి పడిపోయాడు. ఐదో రోజున దేవుడు ప్రత్యక్షమయ్యాడు."

తాత పొడిదగ్గు ఆగపండా మోగింది. కథ కొంచెం సేపు ఆగిపోయింది.

మనవడు మళ్ళీ మొదలెట్టాడు.

"దేవుడు ప్రత్యక్షమై నీకేం కావాలి అని అడిగాడు. అప్పుడు శంకరయ్యకి ఏం అడగాలో తెలియలేదు. ఏమీ వద్దన్నాడు. అయినా దేవుడు ఒప్పుకోక ఓ అద్దం ఇచ్చాడు. నీకు ఏది కావాలన్నా ఈ అద్దంలో చూసి అడుగు అని చెప్పి దేవుడు మాయమైపోయాడు. శంకరయ్య పెద్ద ధనవంతుడైపోతాడన్న మాట. అయినా సరే ఎవరేది అడిగినా ఇచ్చేసేవోడు." తాత పరధ్యానమైపోయాడు. ఊకొడుతున్నాడన్న మాటేగాని అతని ధ్యాసంతా పొలమ్మీదే ఉంది. ఈ యేడైనా నాలుగు వానలు పడితే నాలుగు గింజలు పండుతాయని లెక్కలేసుకుంటున్నాడు. తాత మనసులో జొన్న కంతులు మెదులుతున్నాయి.

తాత కథ వినట్లేదని మనవడికి అర్థమైపోయింది.

"తాతా ఎక్కడిదాకా చెప్పానే' మనవడు బ్రేకేశాడు.

తాత కంగారుపడి "ఆఁ ఆఁ.. అది....అదే దేవుడు ప్రత్యక్షమవుతాడు...." అన్నాడు.

"ఓరోజు శంకరయ్యని ఆ అద్దం ఇచ్చేయమని ఓ ఆసామి అడుగుతాడు. శంకరయ్య ఇచ్చేస్తాడు. మళ్ళీ కొన్నాళ్ళకి

అతను ఏమీలేనోడై పోతాడు. మళ్ళీ శోష వచ్చి పడిపోతాడు. అప్పుడు దేవుడు ప్రత్యక్షమై ఏమీ అడక్కుండా వెళ్ళిపోతాడు. శంకరయ్య లేచి మంచి భోజనం ఉండే బావుణ్ణు అనుకొంటాడు. వెంటనే పంచభక్ష పరమాన్నా లొస్తాయి.''

''భలేగుంది కథ'' అన్నాడు తాత.

''దేవుడు మంచోడు కద తాతా'' అని అడిగాడు మనవడు.

తాత నవ్వాడు. మనవడు పట్టుబడితే ఉత్సాహం తెచ్చిపెట్టుకుని అతనూ ఓ కథ మొదలెట్టాడు.

''పూర్వం ఓ విచిత్రమైన ఊరుఉండేది. అవూళ్ళో అందరూ పెద్దరైతులే. అయితే ఓ ఏడాది అసలు వానలే పడలేదు. రెండో ఏడుకూడా వానచుక్క రాల్లేదు. గొడ్డూ గోదా చిక్కిపోయాయి. రైతులు వాటిని సంతలకి తోలేసి అమ్మేసుకున్నారు. ఎటుచూసినా కరువే. రైతులకి పొలాల్ని ఏం చేసుకోవాలో తెలియ లేదు'' తాత కథ ఆపుచేసి ఆకాశంలోకి చూశాడు. తొలకరి వానలు పడాల్సిన సమయమది. అయినాఒక్క మబ్బుతునక కూడా ఆకాశంలో కన్పించలేదు.

మనవడు గుర్తుచేస్తే మళ్ళీ ఉత్సాహం తెచ్చుకుని చెప్పసాగాడు.

''అయితే ఓ బక్క ఆవు ఒక్కటే ఆడ ఊళ్ళో మిగిలింది. దానికి అందరూ పూజలు చేసేవాళ్ళు. అడసలు ఏమీ అనేది కాదు. అయినా చచ్చిపోదు. అది ఓ రోజున తపస్సు చేయడం మొదలెట్టింది. కొన్నాళ్ళకి దానికి దేవుడు ప్రత్యక్షమై ఏం కావాలని అడుగుతాడు. వానలు పడాలని అది దేవుణ్ణి అడుగుతుంది. అంతే బ్రహ్మాండమైన వానలు కురుస్తాయి.''

వానలుగురించి తాత వర్ణించుకొంటూ పోతూ వుంటే మనవడికి కథ చివరికి ఏమవుతుందా అని వుత్కంఠగా వుంది.

తాత నిజంగా భోరున వాన కురుస్తున్నట్టు వర్ణిస్తున్నాడు. మనవడికి విసుగు పుట్టింది.

''అప్పుడేమయింది'' మనవడు తాతని దార్లోకి తేవాలని ప్రయత్నించాడు.

తన్మయంగా చెప్పుకుపోతున్న తాత మళ్ళీ ఆకాశం నాలుగు మూలలకి చూసుకున్నాడు. ఒక్క మబ్బు తునకలేదు. పైగా వేడి గాలులు. దూరంగా పొలాలు ఏడుస్తున్నట్టు కీచురాళ్ళ ధ్వనులు.

తాత నోరు మెదపడం ఆపేసరికి మనవడికి గొప్పవిసుగొచ్చేసింది.

''ఎందుకులేరా జరగని కథలు చెప్పుకోడం'' అనేసి తాత అటు తిరిగి పడుకున్నాడు. మనవడికేమీ అర్థం కాలేదు.

తెల్లవారు ఝామున వాన చుక్కలు మీద పడితే తాత మనవణ్ని లేపి మంచం వసారాలో వేశాడు.

నిద్ర కళ్ళమీదున్న మనవడు మంచంమ్మీదమళ్ళీవాలిపోయాడు.

''ఆకథఏమయిందోచెప్పనా'' మనవణ్ణి తట్టి లేపి అన్నాడు తాత.

వాన చినుకులు టపటపా రాల్తున్నాయి. తాత చాలా ఉత్సాహంగా ఉన్నాడు.

మనవడు కళ్ళు సోలిపోతున్నాయి. అయినా తాత కథ చెప్పుకుపోతూనే ఉన్నాడు.

రాత్రి మధ్యలో ఆపేసిన కథని తాత ఇప్పుడెందుకు చెప్తున్నాడో మనవడికి అర్థం కాలేదు.

తొలకరి వానకు భూమి పులకిస్తోంది. మట్టివాసన కమ్మగా వస్తోంది. తాత కథ పూర్తిచేసి పాట అందుకున్నాడు. ●


## కొత్త రచయిత(త్రు)లకు అపూర్వ ఆహ్వానం!

# పల్లకి - పద్మాలయ సస్పెన్స్ నవలల పోటీ!

"ఫాస్ట్" యుగం ఇది.

పాఠకులు మారారు. రచయితలూ పాఠకుల అభిరుచులకు అనుగుణంగా మారుతూనేఉన్నారు. కథలైనా, నవలలైనా వేగంగా చదివించేవిగా వుంటేనే పాఠకుల అభిమానం లభిస్తుంది.

పాఠకుల ఈఅభిరుచిని నెరవేర్చేందుకే పద్మాలయపబ్లికేషన్స్, విజయవాడ వారి సౌజన్యంతో "పల్లకి", "సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్" నవలల పోటీని నిర్వహిస్తోంది.

### ఉత్తమమైన మూడు నవలలకు ఒక్కొక్కదానికీ రు. 4,000/- బహుమతి

నిబంధనలు :

1. నవల ఇతివృత్తం ఆంధ్రులకే సంబంధించినదై వుండి, క్రైమ్, సస్పెన్స్, థ్రిల్‌తో నిండివుండాలి. ఈ కాలం పాఠకుల అభిరుచికి తగినట్టుగా వుండాలి.
2. తెలుగులోగానీ, పరభాషలోగానీ ప్రచురించబడిన ఏ ఇతర రచనకూ అనుకరణగానీ, అనువాదంగానీ అయివుండరాదు.
3. భాషలో ఆంగ్ల పదాల వాడకం వీలైనంత తక్కువ వుండాలి.
4. అరటావు సైజులో సుమారు రెండువందల పేజీలుండాలి.
5. బహుమతి పొందిన మూడు నవలలు సీరియల్స్‌గా ప్రచురించబడిన తర్వాత పద్మాలయ పబ్లికేషన్స్‌వారు నవలలుగా ప్రచురించే హక్కును కలిగివుంటారు. అందుకు వేరే పారితోషికంఇవ్వబడదు.
6. సంపాదకునిదే తుది నిర్ణయం.

**ముఖ్యమైన నిబంధన :** రచయిత(త్రు)లు ఖచ్చితంగా కొత్త వారై వుండాలి. ఇంతకు ముందు ఏ రకమైన నవలలూ ప్రచురించబడి వుండరాదు. ఇది కేవలం నూతన, యువ రచయిత(త్రు)లకే పరిమితం.

రచనలు చేరవలసిన చిరునామా :
పల్లకి - పద్మాలయ థ్రిల్లర్ సీరీస్
కేరాఫ్, పల్లకి 6-3-1099/2 రాజ్‌భవన్‌రోడ్
సోమాజిగూడా, హైదరాబాద్-500 482

### రచనలు చేరవలసిన ఆఖరు తేదీ జులై 25, 1986